తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శుక్రవారం
30 అక్టోబర్ 2026
Follow :

సింగూర్ నీటి నిర్వహణ నుంచి రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల వరకు..

- **నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వినతి**

సంగారెడ్డి అక్టోబర్ 29 (జనంసాక్షి): ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి, దాని ప్రభావంతో ప్రజలకు, రైతులకు కలిగే నష్టాలను ముందుగానే అరికట్టేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కోరారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, తాగునీరు, సాగునీరు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పలు సమస్యలపై ప్రజలను నేరుగా కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి, వారి ఇబ్బందులను వివరించారు.

సింగూర్ ప్రాజెక్టు నీటి నిర్వహణలో ముందస్తు ప్రణాళిక, దూరదృష్టి లోపించడం వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాలో తీవ్రమైన తాగునీటి సమస్య తలెత్తే పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం ఉంటుందని తెలిసినప్పటికీ, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటిని వినియోగించడంలో తగిన ప్రణాళికలు రూపొందించలేదని అన్నారు.

సముద్రాలపై వంతెనలు నిర్మించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ప్రస్తుత కాలంలో, సింగూర్ ఆనకట్ట రివెట్‌మెంట్ మరమ్మతుల కోసం ప్రత్యామ్నాయ ఆధునిక సాంకేతిక పద్ధతులను ఎందుకు వినియోగించలేదని అన్నారు.

హనుమాన్ నగర్, చేర్యాల, ఆరుట్ల, బ్యాతల్ గ్రామాలకు సంబంధించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. ఇళ్ల నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన వారికి లబ్ధిదారుల ఎంపికలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా పూర్తికాని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన నిధులు మంజూరు చేసి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట కొత్త బోర్లు వేయడంతోపాటు ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

రైతులకు ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం కింద సరఫరా అవుతున్న విద్యుత్‌తో వ్యవసాయ బోర్ల ద్వారా తోడుతున్న నీటిని బీర్ ఫ్యాక్టరీలకు సరఫరా చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రస్తావించారు. అంశాలపై సంబంధిత అధికారులు విచారణ జరపాలని కోరారు. బీర్ ఫ్యాక్టరీలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే వర్తించే చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బొబ్బిలిగామ, ఏటిగడ్డ సంఘం, మాలపాడు గ్రామాల మీదుగా వెళ్లే రహదారులు పూర్తిగా ధ్వంసమై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ రహదారులకు కనీసం వెట్‌మిక్స్‌తోనైనా తక్షణ మరమ్మతులు చేపట్టి ప్రజలకు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు.

అలాగే రేజింతల్ రోడ్డు, అనంతసాగర్ నుంచి సైదాపూర్ రోడ్డు, సిద్దాపూర్ నుంచి మారేపల్లి రోడ్డు సహా నియోజకవర్గంలోని పలు రహదారులు అధ్వానంగా మారాయని వివరించారు. గుంతలు, గతుకులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నందున సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, దెబ్బతిన్న రహదారులను గుర్తించాలని కోరారు. వెట్‌మిక్స్, అవసరమైన ఇతర మరమ్మతు పనులు చేపట్టి రహదారులను ప్రయాణానికి అనువుగా మార్చాలని సూచించారు.

సంగారెడ్డి నుంచి మదీనాగూడ వరకు జాతీయ రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. అక్టోబర్‌లోగా పూర్తికావాల్సిన పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, పనుల్లో జాప్యానికి కారణాలను గుర్తించి, నిర్మాణ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు..

వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా గత ఏడాదికి సంబంధించిన సన్న వడ్ల బోనస్ కింద రైతులకు చెల్లించాల్సిన రూ.500 బకాయిలు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అర్హులైన రైతులకు బకాయిలను త్వరితగతిన చెల్లించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని, నాణ్యమైన విద్యుత్ అందక వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కుల పంపిణీలో జరుగుతున్న జాప్యాన్ని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి

ఉపాధి పనులను వంద శాతం కల్పించాలి

- **కరువు పరిస్థితుల్లో రైతు కూలీలకు మేలు జరిగేలా పనిచేయాలి**
- **నిర్లక్ష్యం వహించిన ఏడుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు**
- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

గద్వాల నడిగడ్డ, ఆగస్టు 29(జనంసాక్షి); ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున చాలామంది రైతులు ఇబ్బంది పడ్డారని, ఇలాంటి పరిస్థితుల్లో రైతు కూలీలకు విబిజీ రాంజీలో వంద శాతం ఉపాధి హామీ పనులు కల్పించాల్సిందిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

విబిజి రాంజీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఉపాధి హామీ పనులపై కలెక్టర్ గురువారం సాయంత్రం ఐడిఓసి సమావేశపు మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని రైతు కూలీలకు పెద్ద ఎత్తున జాబ్ కార్డులను అందజేసి గుర్తించిన పనులను చేయించాలన్నారు. వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురు క్షేత్ర సహాయకులు పనులు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నేపథ్యంలో వారిని సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

నీటి పొదుపు పాటించాలి... ఎల్‌నినోను ఎదుర్కోవాలి

- **మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత**

నారాయణపేట, అక్టోబర్ 29(జనంసాక్షి): రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ నినో కారణంగా నీటి కొరత ఏర్పడిందని దానిని జయించేందుకు నీటి పొదుపును పాటించాలని నారాయణపేట మున్సిపల్ చైర్మెన్ కొండా శ్వేత సత్య యాదవ్కోరారు.నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్యల పరి ష్కారం, నీటి వృథా నివా రణ, భవిష్యత్తులో నీటి కొరతను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై మున్సిపల్ చైర్‌పర్సన్ కొండ స్వేత సత్య యాదవ్ గారి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో మున్సిప ల్ వైస్ చైర్‌పర్సన్ మంజుల జీఆర్ రెడ్డి ,కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు, మేనేజర్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చాగాపురంను సందర్శించిన కేంద్ర బృందం

ఇటిక్యాల, అక్టోబర్ 29 (జనంసాక్షి): చాగాపురంను ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక చేసేందుకుగాను గురువారం కేంద్ర బృందం గ్రామంలో పర్యటించారు. గురువారం గ్రామాన్ని చేరుకున్న కేంద్ర బృందం సభ్యులు హర్ష కుమార్ ఝా, నవీన్ శివ జిల్లా అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు, డిఆర్ డిఓ ముసాయిదా బేగంలు స్వాగతం పలికారు. ఉత్తమ గ్రామ పంచాయతీగా, గుడ్ గవర్నెన్స్ విభాగంలో ఎంపిక కావడానికి నిర్దేశించిన అర్హతలు, ప్రమాణాలకు అనుగుణంగా గ్రామంలో సిఎస్సి సెంటర్, ఆన్లైన్ సర్టిఫికెట్ ల జారీ, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, పాఠశాల, అంగన్వాడీ, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు, తదితర అంశాలను కేంద్ర బృందం పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రమ్మ, డిపిఓ శ్రీకాంత్, డిఎల్ పి ఓ ప్రవీణ్, ఎంపీడీవో రమాదేవి, ఎంపీ ఓ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జాజాపూర్ లో అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్

నారాయణపేట అక్టోబర్ 29(జనంసాక్షి): నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణ, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సంక్షేమ సేవలు, ప్రభుత్వ పథకాల అమలు తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సంద ర్భంగా అంగన్‌వాడీ టీచర్లను చిన్నారుల ఆరోగ్య పరిస్థితులు, వారి బరువు, ఎదుగుదల, ప్రతిరోజూ అందిస్తున్న పోషకాహారం, గుడ్లు, పాలు పంపిణీ, ప్రభుత్వం నిర్దేశించిన రోజు వారీ మెనూ అమలు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గర్భిణులు, బాలిం తలకు అందిస్తున్న పౌష్టికా హారం, ఇతర సంక్షేమ ప్రయోజనాల పంపిణీ తీరును సమీక్షించారు.అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులతో ముచ్చటించి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకు న్నారు. పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం

ప్రతిరోజూ నాణ్యమైన, సమతుల్య పోషకాహారాన్ని తప్పనిసరిగా అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. పోషకాహార పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న పోషకాహార నిల్వలను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి, సరుకుల నిల్వలు, పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారు ల ఆరోగ్య పరిరక్షణ,సంపూర్ణ ఎదుగుదల, పోషకాహార లోపాల నివారణలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు అర్హు లందరికీ సక్రమంగా అందే లా సిబ్బంది బాధ్యతాయు తంగా విధులు నిర్వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో పరిశుభ్రతకు ప్రాధాన్యత నిస్తూ, పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యకర మైన భవిష్యత్తుకు కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి..

- వ్యసన విముక్తితో గౌరవప్రదమైన జీవితం సాధ్యం
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 29 (జనంసాక్షి): మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, మంచి మార్గంలో నడుస్తూ కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. గురువారం సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని వ్యసన విముక్తి కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిసైన వారిని వ్యసనం నుంచి బయటపడేసి, వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం ద్వారా సాధారణ జీవితం గడిపేలా చేయడమే కేంద్రం ప్రధాన లక్ష్యమన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గుర్తించి, చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. ఎస్-నాబ్ ఆధ్వర్యంలో వ్యసన విముక్తి కేంద్రానికి ఇండోర్ క్రీడా సామగ్రిని అందజేశారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని పేర్కొన్నారు.

అనంతరం కేంద్రంలోని వైద్యులతో మాట్లాడి, చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వ్యసనం నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న వారికి తగిన సహకారం, ప్రోత్సాహం అందించి, వారిలో సానుకూల మార్పు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ శ్రీలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ, ఆర్ఎంఓలు డాక్టర్ రవికుమార్, డాక్టర్ పద్మావతి, ఎస్-నాబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్ట్

అమీన్పూర్, అక్టోబర్ 29 (జనంసాక్షి): అకారణంగా ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. అమీన్పూర్ ఎస్సై విజయ్ తెలిపిన వివరాలు ప్రకారం బుధవారం అర్ధరాత్రి జయలక్ష్మి నగర్ మండే మార్కెట్ వద్ద జీవన్ రతన్, వినోద్ కుమార్ ఇద్దరు భోజనం చేస్తుండగా అభిలాష్ గౌడ్ అనే రౌడీ షీటర్ పక్కనే మూత్రం పోశాడు. దాంతో వారు భోజనం చేస్తున్నాము పక్కకు వెళ్ళమని చెప్పడంతో నన్నే పక్కకు వెళ్ళమంటావా అంటూ పక్కనే ఉన్న కట్టలు తీసుకొని వినోద్ కుమార్, జీవన్ రతన్ లను తీవ్రంగా గాయపరిచాడు. అంతటితో ఆగకుండా అతని తండ్రి శ్రీనివాస్ గౌడ్ అలియాస్ బిచ్చు గౌడ్ అక్కడికి చేరుకొని వారిని మరింత కట్టెలతో కొట్టి గాయపరిచాడు. జీవన్ రతన్ తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని గురువారం అభిలాషను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. అతని తండ్రి శ్రీనివాస్ గౌడ్ అలియాస్ బిచ్చు గౌడ్ పరారీలో ఉన్నాడు.

కరెంటు స్తంభం పై నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు

చేర్యాల, అక్టోబర్ 29 (జనంసాక్షి): చేర్యాల మండల కేంద్రంలోని ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా విద్యుత్ పనులు చేస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. కొత్త దొమ్మాట గ్రామానికి చెందిన కొలిపాక ప్రశాంత్ అనే యువకుడు గురువారం కరెంటు స్తంభంపై పనిచేస్తుండగా కళ్లు తిరిగి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికుల సమాచారంతో చేర్యాల 108 సిబ్బంది ఈఎంటీ శ్రీకాంత్, పైలట్ రవి సంఘటన స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

కామారం తాండాలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

చిన్నశంకరంపేట, అక్టోబర్ 29(జనంసాక్షి): మండలంలోని కామారం తాండాలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగేశ్ గారు, గ్రామ సర్పంచ్ డాక్టర్ హలావత్ మోహన్ నాయక్, ఉప సర్పంచ్ విజయ, సిట, రమేష్ పంచాయతీ కార్యదర్శి పద్మ,పీఏసీఎస్ డైరెక్టర్లు, బాబు ,భిక్షపతి,శివరాం గ్రామ పంచాయతీ వార్డ్ మెంబర్లు మోహన్, వినోద్, మోహన్, చందర్, తాండా నాయకులు రవిచంద్, రాజు, రవి, సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన

కొండాపూర్, అక్టోబర్ 29 (జనంసాక్షి): విద్యార్థులకు చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు గురువారం కొండాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి సౌజన్య పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు వివిధ చట్టాలు, సైబర్ నేరాల గురించి వివరించారు. **ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...** ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు వాటిని గౌరవించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎలిజబెత్, ఎస్ఐ సోమేశ్వరి పాల్గొన్నారు. విద్యార్థుల్లో చట్టాల పట్ల గౌరవం, సామాజిక బాధ్యత పెంపొందించడమే కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.

నిరుపేద కుటుంబానికి హరీష్ రావు ఆర్థిక సహాయం

నంగునూర్, అక్టోబర్ 29 (జనంసాక్షి): మండలంలోని అంక్షాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద మహిళ దూదేకుల అలీమ (70) అనారోగ్యంతో మృతి చెందారు. సర్పంచ్ పద్మ బుచ్చి వీరయ్య మరియు మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హరీష్ రావు వెంటనే స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు మృతురాలి కుటుంబానికి 5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బుచ్చి వీరయ్య, వెంకట కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ను ప్రారంభించిన సర్పంచ్

మల్లకల్, అక్టోబర్ 29(జనంసాక్షి): మండల పరిధిలోని కుర్తి రావుల చెరువు గ్రామంలోని గురువారం బీసీ కాలనీలో లోవోల్టేజ్ సమస్య ఉన్నందున ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నందువలన నూతన ట్రాన్స్ఫారంను గ్రామ సర్పంచ్ కె భగవంతు ప్రారంభించారు. ఇప్పుడు నుంచిఈ ట్రాన్స్ఫార్మర్ వలనలో వోల్టేజ్ సమస్య తీరుతుంది. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ రాఘవేంద్ర గౌడ్,గ్రామ నాయకులు ధనుంజయ, పరశురాముడు,తిమ్మప్ప పుల్లూరు కర్ణాకర్, రామన్న లైన్మెన్ దర్శిల్లి పాల్గొన్నారు.

తక్కువ వర్షపాతంలో ఉద్యాన పంటలను కాపాడుకోవాలి

- బిందు సేద్యంతో నీటి వినియోగం తగ్గించుకోవాలి
- ఉద్యాన పంటల రైతులకు అధికారుల సూచనలు
- మల్చింగ్‌కు ఎకరానికి రూ.8 వేల రాయితీ
- జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వరరావు

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 29 (జనంసాక్షి): తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ఉద్యాన పంటలను కాపాడుకోవడంతో పాటు నీరు, ఎరువులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సోమేశ్వర తెలిపారు. గురువారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో కోహీర్ మండలం వెంకటాపూర్ రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయిల్‌పామ్, ఆలు పంటలు సాగు చేస్తున్న రైతులకు పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వరావు మాట్లాడుతూ, తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ పంటలకు అవసరమైన నీటిని సకాలంలో అందించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూక్ష్మ సేద్య పథకాలను సద్వినియోగం చేసుకొని బిందు సేద్యం ద్వారా నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. మల్చింగ్ విధానంతో నేలలో తేమను కాపాడుకోవచ్చని, పంటల పెరుగుదలకు అనుకూల పరిస్థితులు కల్పించవచ్చని తెలిపారు. ఈ విధానాన్ని ప్రోత్సహించేందుకు అర్హులైన రైతులకు ఎకరానికి రూ.8,000 రాయితీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కూరగాయల నారును కూడా కేంద్రం ద్వారా రాయితీపై అందిస్తున్నట్లు వివరించారు. జహీరాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు వైద్యనాథ్ మాట్లాడుతూ, నీటి యాజమాన్యంతో పాటు ఎరువుల యాజమాన్యంపై కూడా రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఉద్యాన శాఖ అధికారులు అందించే పంటల వారీ సూచనలు పాటిస్తూ, పంట అవసరాలకు అనుగుణంగా నీరు, ఎరువులు వినియోగించుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జహీరాబాద్ డివిజన్ ఉద్యాన శాఖ అధికారులు పండరి, కోహీర్ ఉద్యాన శాఖ అధికారి సునీత, వ్యవసాయ అధికారి నవీన్, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్, ఉద్యాన విస్తరణ అధికారులు విట్టల్, రవీందర్, శైలజ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, బిందు సేద్య పరికరాల సంస్థల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

జీఎంపీవీఎస్ సిద్దిపేట, జనగామ జిల్లాల ఇంచార్జిగా అందె అశోక్

చేర్యాల, అక్టోబర్ 29(జనంసాక్షి): గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం (జీఎంపీవీఎస్) సిద్దిపేట, జనగామ జిల్లాల ఇంచార్జిగా మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన అందె అశోక్‌ను నియమించారు. బుధవారం హైదరాబాద్ లోని రాజ్ బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా

వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం గొల్ల, కురుమలకు గొర్రెలు, మేకల పెంపకం కోసం 75 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని, అడవిలో గొర్రెలు, మేకలు మేపుకునేందుకు హక్కులు కల్పించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన పశువులకు నష్టపరిహారం చెల్లించాలని, 10 లక్షల వరకు ఎలాంటి షరతులు లేకుండా బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలని, గొల్ల, కుర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి బడ్జెట్ లో రూ.10 వేల కోట్లు కేటాయించాలన్నారు. 50 ఏళ్లు నిండిన గొల్ల కుర్మలకు రూ. 5 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కొమ్ము అశోక్ యాదవ్, ఎల్. శ్రవణ్ కుమార్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.37 కోట్లతో గంగకత్వ ఆధునీకరణ పనులు...

- 11 గ్రామాల రైతులకు ప్రయోజనం
- రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా గంగకత్వ పనులు చేపట్టాలి
- కాంట్రాక్టర్లను దృష్టిలో పెట్టుకొని చేయొద్దు
- ఇరిగేషన్ అధికారులకు జగ్గారెడ్డి సూచన

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 29 (జనంసాక్షి): గంగకత్వకు పూర్వవైభవం తీసుకొచ్చేలా ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని జగ్గారెడ్డి ఇరిగేషన్ అధికారులకు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సూచించారు. రైతులకు మేలు జరిగేలా పనులు చేపట్టాలే తప్ప కాంట్రాక్టర్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చేయవద్దని స్పష్టం చేశారు. గంగకత్వ ఆధునీకరణ పనుల కోసం రూ.37 కోట్ల నిధులు తీసుకొచ్చి పనులు ప్రారంభించనున్న నేపథ్యంలో జగ్గారెడ్డి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు పూర్తయితే 11 గ్రామాల్లోని రైతులకు ప్రయోజనం కలగడంతో పాటు సుమారు 3,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉంటుందన్నారు. ప్రాజెక్టు రూపకల్పనకు అనుగుణంగా సాధ్యమైనంత ఎక్కువగా పూడిక తొలగించి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు

సూచించారు. రైతుల నుంచి ఇంకా ఏవైనా విజ్ఞప్తులు వస్తే వాటిని కూడా పరిగణనలోకి తీసుకొని పనులు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

మునిపల్లి, అక్టోబర్ 29(జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మండల విద్యాధికారి భీంసింగ్ అన్నారు. మగ్గూంపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుడు తెలుగు యాదగిరి తన సొంత నిధులతో విద్యార్థులకు నోటు పుస్తకాలు, రాత సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భీంసింగ్ మాట్లాడుతూ పాఠశాలల బలోపేతానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. విద్యార్థుల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యాదయ్య, ఉపాధ్యాయులు, దాత తెలుగు యాదగిరి పాల్గొన్నారు.

దేవి రవీందర్‌ను పరామర్శించిన హరీశ్‌రావు

కొండపాక, అక్టోబర్ 29 (జనంసాక్షి): కొండపాక మండల మాజీ వైస్ చైర్మన్, రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ దేవి రవీందర్ కారుపై జరిగిన దాడి ఘటనపై బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆయనను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు, దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మరో రెండేళ్లలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటామని, ప్రజాస్వామ్య పద్ధతిలో సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, బక్కి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు తాగునీటి వసతి సమకూర్చిన దాతలు

నంగునూరు, అక్టోబర్ 29 (జనంసాక్షి): పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను గుర్తించి, గ్రామ ఉద్యోగులు తమ ఉదారతను చాటుకున్నారు. పాలమాకుల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామ ఎక్సైజ్ ఎస్సై కాటారం మధుసూదన్, సింగపూర్‌లో ఉద్యోగం చేస్తున్న దండబోయిన తిరుపతి గురువారం రూ. 30 వేల వ్యయంతో పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్‌తో పాటు నల్లాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల దాహార్తి తీర్చిన దాతలను స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ప్రభాకర్‌రావు, పాఠశాల హెచ్ఎం సుజాత, సర్పంచ్ ఓజాలు, రవీందర్‌రెడ్డి, వేణు, మహేష్, రవీందర్‌రెడ్డి, కృష్ణమూర్తి మరియు ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన సాదుల పవన్ కుమార్

నంగునూరు, అక్టోబర్ 29 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డిని సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, నంగునూరు ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. నంగునూరు మండలంలో పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పవన్ కుమార్ పేర్కొన్నారు. నాయకులంతా సమష్టిగా పనిచేసి కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని శివచరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పిడిశెట్టి ప్రభాకర్, సిద్రం భాను పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆర్థికసాయం

చిన్న శంకరంపేట, అక్టోబర్ 29(జనంసాక్షి): మండలంలోని మీర్జాపల్లి గ్రామానికి చెందిన నెరల్లా లక్ష్మి అకాల మరణం పట్ల బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. లక్ష్మి మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు తనవంతు సహాయంగా ఆర్థిక సాయాన్ని అందజేశారు. గ్రామ బీఆర్ఎస్ నాయకుల ద్వారా బాధిత కుటుంబానికి ఈ ఆర్థిక సాయాన్ని అందించారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం సామాజిక బాధ్యతగా భావించి తిరుపతిరెడ్డి సహాయం అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సంగారెడ్డి, అక్టోబర్ 29 (జనంసాక్షి): రైతులు, ఖాతాదారులు అందుబాటులో ఉన్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ ఇస్నాపూర్ బ్రాంచ్ మేనేజర్ పాపమ్మ సూచించారు. రామేశ్వరం బండ గ్రామంలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలపై వివరించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఖాతాల రీ-కేవైసీ పూర్తి చేయాలని సూచించారు. స్థిర డిపాజిట్లు, ఇతర బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆంతిరెడ్డి, పటాన్‌చెరు బ్రాంచ్ మేనేజర్ అశ్విని, రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

కొమురవెల్లి, అక్టోబర్ 29 (జనంసాక్షి): కొమురవెల్లి మండలానికి చెందిన ఎక్కలదేవి లక్ష్మికి రూ.13 వేలు, కాపర్తి కృష్ణమూర్తికి రూ.45 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. చెక్కులను బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకోవాలని సూచించారు. ఆర్థికసాయం మంజూరుకు సహకరించిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప, ఏర్పుల మహేష్, గొల్లపల్లి ఆంజనేయులు, కిష్టయ్య, పోతుగంటి శ్రీనివాస్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గురువుల ఆశీస్సులతో సన్మార్గంలో నడవాలి

మెదక్, అక్టోబర్ 29 (జనంసాక్షి): గురువుల ఆశీస్సులతో సన్మార్గంలో నడుస్తూ ఆధ్యాత్మిక విలువలను ఆచరించాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. మెదక్‌లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి నివాసంలో గురువారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామివారి పాదుకా పూజలో పాల్గొని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా స్వామి వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో దైవత్వాన్ని గుర్తించాలని, తల్లిదండ్రులను గౌరవిస్తూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని సూచించారు. కష్టాల్లోనూ కర్తవ్యాన్ని విస్మరించకుండా సేవాభావంతో జీవించాలని హితవు పలికారు. తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ బట్టి జగపతి దంపతులను ఆశీర్వదించారు.

అమరవాది లక్ష్మీనారాయణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

వెల్దండ, అక్టోబర్ 29 (జనంసాక్షి): రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఆర్యవైశ్య సంఘం నాయకుడు బిక్కుమండ్ల శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అమరవాది లక్ష్మీనారాయణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారని తెలిపారు. నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు విద్య, ఆర్థిక సహాయం అందిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా సేవలందించారని గుర్తుచేశారు. ఆయన సేవలను గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పెంట్లవెల్లి మండల కేంద్రంలో బిఆర్‌యస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

కొల్లాపూర్, అక్టోబర్ 29 (జనంసాక్షి): కొల్లాపూర్ మాజీ శాసన సభ్యులు శ్రీ బీరం హర్షవర్ధన్ రెడ్డి గారి ఆదేశానుసారం పెంట్లవెల్లి మండల కేంద్రంలో బిఆర్‌యస్ పార్టీ ఆధ్వర్యంలో పెంట్లవెల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ధర్నా చేయడం జరిగింది. పెంట్లవెల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి శ్రీ చిట్టెమ్మసురేందర్ గౌడ్ గారు మాట్లాడుతూ మండలంలో దాదాపుగా 1200 ఎకరాలు ఎండిపోయిన కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి పెంట్లవెల్లి మండలం మీద ఎందుకింత వివక్ష చూపుతున్నారో కొల్లాపూర్ శాసనసభ్యులు మంత్రి గారైన జూపల్లి కృష్ణారావు గారు, అధికారులు దీనికి సమాధానం చెప్పాలన్నారు. ఒకవేళ పెంట్లవెల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోతే పెద్ద ఎత్తున రైతులతో నిరసన కార్యక్రమాలు చేసి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ధర్నా చేసిన తరువాత ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వో గారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెంట్లవెల్లి మండల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు,

ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కొల్లాపూర్ మండల మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మునిగడపలో విద్యార్థుల రాస్తా రోకో...

జగదేవ్‌పూర్ అక్టోబర్ 29 (జనం సాక్షి): ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేస్తూ గురువారం జగదేవ్‌పూర్ మండల పరిధిలోని మునిగడపలో విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ మునిగడపలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొంత కాలంగా తెలుగు భాషోపాధ్యాయుడు లేక పోవడంతో విద్యాభ్యాసానికి విఘాతం ఏర్పడి పూర్తిస్థాయిలో చదువులు సాగడం లేదని విచారం వ్యక్తం చేశారు. పాఠశాలలో తెలుగు బోధించే ఉపాధ్యాయులు ఇరువురు ఉండగా అందులో ఒకరు పదవీ విరమణ చెందగా మరొకరు డిప్యూటేషన్‌పై సిద్దిపేటకు వెళ్లారని వాపోయారు. ఈ విషయంలో అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పెడచెవిన పెడుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో విద్యార్థులు సుమారు గంట పాటు రోడ్డుపై బైఠాయించి కాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో విషయం తెలుసుకున్న జగదేవ్‌పూర్ ఎస్సై కృష్ణారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని విద్యాశాఖ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి సిద్దిపేటకు వెళ్లిన ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు చేయించి తిరిగి పాఠశాలకు నియమించేలా ఉత్తర్వులు జారీ చేయించగా విద్యార్థులు రాస్తారోకో విరమించారు.

నర్మేటలో బిఆర్ఎస్‌వి నూతన కమిటీ ఎన్నిక

నంగునూరు, అక్టోబర్ 29 (జనంసాక్షి): మండల పరిధిలోని నర్మేట గ్రామంలో బిఆర్ఎస్వి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆదేశాల మేరకు ఏర్పాటైన ఈ కమిటీ అధ్యక్షుడిగా రాయిలి కుమార్, ఉపాధ్యక్షులుగా మానుపాటి అశోక్, బోదాసు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా మోడీకే అనిల్, కోశాధికారిగా గట్టు ఆనంద్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి బి ఆర్ఎస్విమాజీ జిల్లా అధ్యక్షుడు మెరుగు మహేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నూతన కమిటీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, మండల విద్యార్థి విభాగం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలి

శ్రీరంగాపూర్, అక్టోబర్ 29 (జనం సాక్షి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో డిగ్రీ అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలని శ్రీరంగాపూర్ తహసిల్దార్ వరలక్ష్మి పిలుపునిచ్చారు. డిగ్రీ పూర్తి చేసిన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మండలంలో ఎవరూ మిగిలిపోకుండా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా తహసిల్దార్ కార్యాలయంలో ఫారం-18సమర్పించి దరఖాస్తు చేసుకోవచ్చని తాసిల్దార్ వరలక్ష్మి తెలిపారు.

సిమెంట్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

జడ్చర్ల, అక్టోబర్ 29(జనంసాక్షి): జడ్చర్ల మున్సిపాలిటీ కావేరమ్మపేటలో తుప్పు పట్టి ప్రమాదకరంగా మారిన పాత ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో నూతన సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని బిజెపి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం విద్యుత్ శాఖ సహాయ కార్య నిర్వాహక ఇంజనీర్ (ఏఈ)కి వినతి పత్రం అందజేశారు. వర్షాకాలంలో షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రజలు, చిన్నారులు, మూగజీవాలు విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని, అధికారులు తక్షణమే స్పందించి కాంక్రీట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పిట్టల నరేష్, ముష్టి రమేష్ కుమార్, బుక్క యాదగిరి, గుండు నరసింహ రాజు పాల్గొన్నారు.

పశువులకు నాణ్యమైన పచ్చిమేత..

- పశుపోషకులకు ఆర్థిక ప్రయోజనం
- వ్యక్తిగత పశుగ్రాస అభివృద్ధి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంతకుమారి

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 29 (జనంసాక్షి): పశువులకు ఏడాది పొడవునా నాణ్యమైన పచ్చిమేత అందుబాటులో ఉంచడంతో పాటు పశుపోషకులకు ఆర్థిక ప్రయోజనం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యక్తిగత పశుగ్రాస అభివృద్ధి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకురాలు వసంతకుమారి సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన రైతులు తమ భూముల్లో పశుగ్రాస పంటలను సాగు చేసుకొని పశువులకు అవసరమైన మేతను స్వయంగా సమకూర్చుకోవచ్చని తెలిపారు. పశువులకు సమతుల్య పోషకాహారం అందించడం వల్ల వాటి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పాల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సొంతంగా పశుగ్రాసం సాగు చేసుకోవడం ద్వారా బయటి నుంచి మేత కొనుగోలు చేసే ఖర్చు తగ్గి, పశుపోషణ మరింత లాభదాయకంగా మారుతుందని వివరించారు. పశుగ్రాస సాగుకు అనువైన భూమి, తగిన నీటి వసతి ఉన్న రైతులు నిర్దేశిత అర్హతల ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పశుగ్రాస సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సామగ్రి కోసం సహాయం అందించే అవకాశం ఉందని తెలిపారు. రైతులు తమ భూమి స్వభావం, నీటి లభ్యతను బట్టి అనువైన పశుగ్రాస పంటలను ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, రాయితీ వివరాల కోసం సమీప పశువైద్యశాల లేదా పశు సంవర్ధక శాఖ అధికారులను సంప్రదించాలని వసంతకుమారి కోరారు.

నేల ఆరోగ్య పరిరక్షణతోనే సుస్థిర వ్యవసాయం

- వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్

కృష్ణ, అక్టోబర్ 29 (జనంసాక్షి): నెల ఆరోగ్య పరిరక్షణ తోనే సుస్థిర వ్యవసాయం సాధ్యమని కృష్ణ మండలం వ్యవసాయ అధికారి సుద ర్శన్ గౌడ్ అన్నారు. ఖేతీ బచావో అభియాన్ (సాగు భూమి సంరక్షణ కార్యక్రమం)లో భాగంగా గురువారం తంగి డి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి నేల ఆరోగ్య పరిరక్షణ, పచ్చి రొట్ట ఎరువుల వినియోగం, వరి కొయ్యల దహనం వల్ల కలిగే అనర్థాలు, ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగా హన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ, పచ్చిరొట్ట ఎరువుల వినియోగంతో నేల సారవంతతను పెంపొందించడంతో పాటు సేంద్రియ పదార్థాల శాతాన్ని మెరుగుపరచు కోవచ్చని తెలిపారు. రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పచ్చిరొట్ట ఎరువుల సాగును ప్రోత్స హించాలని సూచించారు. వరికోత అనంతరం కొయ్యలను పొలాల్లో కాల్చడం వల్ల నేలలోని ఉపయోగకరమైన సూక్ష్మ జీవులు నశించడంతో పాటు నేలలోని సేంద్రియ పదార్థాలు తగ్గి, పర్యావర ణ కాలుష్యం పెరుగుతుం దని వివరించారు. వరి కొయ్యలను కాల్చకుండా పొలంలో కలియదున్ని, తగిన పద్ధతుల్లో కుళ్లేలా చేయడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచు కోవచ్చని సూచించారు.

ఎల్ నినో ప్రభావంతో వాతా వరణ పరిస్థితులు, వర్షపా తంలో మార్పులు సంభవిం చే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగు ప్రణాళికలను రూపొందించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా రాబోయే యాసంగి సీజన్‌లో నీటి వినియోగా న్ని తగ్గించే ఆరుతడి పంట ల సాగుపై దృష్టి సారించాలని, వరి సాగుకు ప్రత్యామ్నా యంగా పప్పుధాన్యాలు తదితర అనుకూల పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లింగప్ప, వ్యవసాయ విస్తరణాధికారులు బి. అభిలాష్, ఎం. రవికుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్‌ను కరువు మండలంగా ప్రకటించాలి

- ఎండిన పంటలకు ఎకరాకు రూ.25వేల పరిహారం ఇవ్వాలి
- జూలపల్లిలో ఎండిపోయిన పంటలను పరిశీలించిన సీపీఎం బృందం

మహమ్మదాబాద్,అక్టోబర్ 29(జనంసాక్షి): మండలంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులు, నీటి ఎద్దడి కారణంగా పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మహమ్మదాబాద్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి,పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని జూలపల్లి గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను పార్టీ ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు,రాష్ట్ర నాయకులు కిందే గోపాల్, జిల్లా కమిటీ సభ్యులు గుండుమల్ల నర్సింలు, వై.లక్ష్మయ్య మాట్లాడుతూ.. మండలంలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చడంతో అనేక గ్రామాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. జూలపల్లిలోనూ పలువురు రైతులు సాగు చేసిన పంటలు నీరు అందక ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నీటికొరత కారణంగా గ్రామంలో సుమారు 75 శాతం పంటలు ఎండిపోయినట్లు వారు పేర్కొన్నారు. పెట్టుబడుల కోసం అప్పులు చేసి సాగు చేపట్టిన,పంటలు చేతికి అందకపోవడంతో రైతులను ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని అన్నారు.రైతులుసాగు చేసిన పంటలకు నీరందకపోవడం,పెట్టుబడులు తిరిగి వచ్చే.పరిస్థితి లేకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి, మహమ్మదాబాద్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు.రైతుల పంట నష్టంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గుండుమల్ల పద్మ, ఉపసర్పంచ్ కొమ్ము కిష్టయ్య, సీపీఎం గ్రామ కార్యదర్శి బి.రాజు, నాయకులు, ప్రశాంత్, కేశవులు, నారాయణ, బోయిన సుధాకర్, బెస్తశివ, జితేందర్ తదితరులు,పాల్గొన్నారు.

గారిడేగావ్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి

సిర్గాపూర్, అక్టోబర్ 29 (జనంసాక్షి): సిర్గాపూర్ మండల పరిధిలోని గారిడేగావ్ గ్రామంలో గురువారం నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. VBGRMG నిధుల ద్వారా రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సమైక్య భవనానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన రాదవ్వ భర్త నర్సు గోండ గారి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. తదుపరి గ్రామంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గారిడేగావ్ గ్రామానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నగేష్, యాదవ్ రెడ్డి, మండల నాయకులు రవీందర్ పాటిల్, నరేందర్, పండరి, శ్యామ్ ముదిరాజ్, వినోద్, పుల్ సింగ్ సర్పంచులు, మధుసూదన్ మాజీ సర్పంచ్, జైరాజ్, వెంకట్ రావు తదితర ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆపన్నహస్తం ముఖ్యమంత్రి సహాయ నిధి

- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రెండు లక్షల 75 వేల రూపాయల విలువైన ఎల్ఓసిల పంపిణీ

పటాన్చెరు, అక్టోబర్ 29(జనంసాక్షి): ఆపత్కాల సమయంలో నిరుపేదలకు ఆపన్న హస్తం అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ముత్తంగి డివిజన్ పరిధిలోని వెలిమల గ్రామానికి చెందిన పటాన్చెరు పాపయ్య, భారతీ నగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీకి చెందిన పసుపుల విక్రంలు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుండి పాపయ్యకు ఒక లక్ష 25 వేల రూపాయలు, విక్రమ్ కు ఒక లక్ష 50 వేల రూపాయలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఎల్ఓసి పత్రాలను ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాయ్ కాడి విజయ్ కుమార్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మేరాజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ మంజులా దేవి సేవలు అభినందనీయం

- ఘనంగా ఉద్యోగ విరమణోత్సవ వేడుక
- పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ
- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్

జడ్చర్ల, అక్టోబర్ 29 (జనంసాక్షి): విద్యారంగానికి జడ్చర్ల మండల విద్యాధికారి (ఎంఈఓ) మంజులా దేవి అందించిన నిస్వార్థ సేవలు ఎంతో అభినందనీయమని పలువురు ప్రజా ప్రతినిధులు కొనియాడారు. జడ్చర్ల పట్టణంలోని చంద్ర గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన ఎంఈఓ మంజులా దేవి పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి, మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ హాజరై ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగంలో అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ, విద్యాభివృద్ధికి మంజులా దేవి చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆమె జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ మంజులా దేవి మార్గదర్శకత్వంలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు నేడు సమాజంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ, ఎలాంటి లోటు రాకుండా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఆమె కీలక పాత్ర పోషించారని కొనియాడారు. మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జడ్చర్లలో విద్యా ప్రమాణాల పెంపునకు ఎంఈఓ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ మాట్లాడుతూ పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఎంఈఓ గా అందరి హృదయాల్లో గుర్తింపు తెచ్చుకోవడం విశేషమన్నారు. వేడుకలో ఎమ్మెల్సీ కోదండరాం, జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ముచ్చర్ల జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జడ్చర్ల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంజులా దేవిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, సీనియర్ విలేఖరులు, జనంసాక్షి విలేఖరి గోనెల నరేందర్, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాన్ని సందర్శించిన ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ రఘు

కౌడిపల్లి, అక్టోబర్ 29(జనంసాక్షి): మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లిలో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో నూతనంగా మూడు రూములతో నిర్మిస్తున్న భవనాన్ని గురువారం రోజు ఉదయం ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ రఘు, సందర్శించారు. నూతన భవన నిర్మాణానికి సంబంధించిన ఇసుక, ఇటుక, స్టీలు సిమెంట్, కంకర, డస్ట్, వంటి మెటీరియల్‌ని పరీక్షించారు. నూతన భవనానికి వాడుతున్న మెటీరియల్ నాణ్యతతో కూడిన మెటీరియలే వాడుతున్నారన్నారు. క్వాలిటీ బాగుందన్నారు. అనంతరం వార్డెన్ జయరాజ్, మాట్లాడుతూ... గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న మూడు రూముల నూతన భవనంతో పాటు బాత్రూంలు రిపేర్ వర్క్ చేయడం జరుగుతుందన్నారు.

విద్యుత్తు పొదుపులో రైతులు, వినియోగదారులు సహకరించాలి

- ఆరుతడి పంటల సాగు శ్రేయస్కరం: ఎస్ఈ నారాయణ నాయక్

మెదక్, అక్టోబర్ 29 (జనంసాక్షి): జిల్లాలో రైతులు, గృహ విద్యుత్తు వినియోగదారులు విద్యుత్తును పొదుపుగా వినియోగించి శాఖకు సహకరించాలని మెదక్ జిల్లా విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ నారాయణ నాయక్ కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయడం రైతులకు, విద్యుత్తు వినియోగానికి ఎంతో శ్రేయస్కరమని తెలిపారు.

గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గృహ విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగినప్పటికీ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యుత్తు డిమాండ్ పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. పంటల నూర్పిళ్ల అనంతరం ప్రభుత్వం సూచించిన విధంగా ఆరుతడి పంటలు సాగు చేస్తే విద్యుత్తు వినియోగం తగ్గడంతో పాటు రైతులకు ఇబ్బందులు తప్పుతాయని వివరించారు. ఈ అంశంపై ఇప్పటికే జిల్లాలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గృహాలు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను అవసరమైనప్పుడే వినియోగించాలని, విద్యుత్తును వృథా చేయకుండా పొదుపు చేయాలని సూచించారు.

నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నామని చెప్పారు. విద్యుత్తు తీగలు, ఫ్యూజులు, ఎర్తింగ్ వైర్లను సరిచేస్తూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. రైతులు, వినియోగదారులు విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని నారాయణ నాయక్ విజ్ఞప్తి చేశారు.

వెంకటాపూర్ తండాలో తాగునీటి ట్యాంకుల శుభ్రత

- ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ జలధార' కార్యక్రమం
- జర్మన్ సాంకేతికతతో వ్యర్థాల తొలగింపు.. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

కల్వకుర్తి,అక్టోబరు 29(జనంసాక్షి): ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'స్వచ్ఛ జలధార' కార్యక్రమంలో భాగంగా గురువారం కల్వకుర్తి మండలంలోని వెంకటాపూర్ తండా గ్రామపంచాయతీలో తాగునీటి నిల్వ ట్యాంకులను శుభ్రపరిచారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో మూడో విడతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించి శుభ్రం చేశారు. తాగునీటి నాణ్యతను మెరుగుపరచడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ కార్యక్రమాన్ని కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో దశలవారీగా చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ తండా సర్పంచి ఇస్లావత్ లక్ష్మి, శంకర్ నాయక్, ఉపసర్పంచి శాంతి శంకర్, ఐక్యత ఫౌండేషన్ ప్రతినిధులు రవి, శంకర్, సురేష్, వార్డు సభ్యులు, యువకులు, గ్రామపెద్దలు సర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

- జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో 400 మంది కళాకారుల ప్రతిభ

సంగారెడ్డి, అక్టోబర్ 29 (జనంసాక్షి): యువత స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దేశభక్తితో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ పాండు పిలుపునిచ్చారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో ఆయన మాట్లాడారు. సుమారు 400 మంది యువ కళాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. జానపద నృత్యం, గేయం, వీధి నాటకం తదితర పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, యువజన క్రీడల శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రీయ ఏక్తా దివస్ పరేడ్‌కు తారా కళాశాల వాలంటీర్లు

- కెవడియా ఏక్తా దివస్ వేడుకలకు 11 మంది సంగారెడ్డి బృందం

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 29 (జనంసాక్షి): గుజరాత్‌లోని కెవడియాలో అక్టోబర్ 31న నిర్వహించనున్న రాష్ట్రీయ ఏక్తా దివస్-2026 జాతీయ స్థాయి కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా నుంచి 11 మంది జాతీయ సేవా పథకం వాలంటీర్లు, ఐదుగురు సర్పంచులు ఎంపికయ్యారు. వీరిలో తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సంగారెడ్డికి చెందిన 11 మంది వాలంటీర్లు ఉండటం కళాశాలకు, జిల్లాకు గర్వకారణమని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి సంబంధించిన సమన్వయ బాధ్యతలను సంగారెడ్డి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, ఎమ్మార్వో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాలంటీర్ల ఎంపికపై కళాశాల అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ అవకాశం యువతలో జాతీయ సమైక్యతపై అవగాహనను పెంపొందిస్తుందని పేర్కొన్నారు.

ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

ఆత్మకూర్, అక్టోబర్ 29 (జనంసాక్షి): భూగర్భ జలాల పెంపునకు ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సూచించారు. ఆత్మకూర్ మండలం ఆరేపల్లిలో ఇంకుడు గుంతల పనులను పరిశీలించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడం ద్వారా నీటి కొరతను నివారించవచ్చన్నారు. పంట కుంటలు, బోర్‌వెల్ రీఛార్జ్ పనులపై అవగాహన కల్పించాలని, పశుగ్రాసం, పశువుల తాగునీటి తొట్టెల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

సొసైటీ భూములపై కబ్జా కన్ను... కదిలిన కలెక్టర్

- ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదులతో స్పందించిన కలెక్టర్ ప్రతీక్ జైన్
- ప్రైవేట్ వ్యక్తుల కబ్జా ప్రయత్నాలను అడ్డుకోవాలి.. భూముల సరిహద్దులు నిర్ణయించాలని బాధితుల ఆవేదన

అమీన్పూర్, అక్టోబర్ 29 (జనంసాక్షి): అమీన్‌పూర్‌లో సొసైటీ భూములను కొందరు ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితులు పలుమార్లు ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు చేయడంతో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పందించారు. బీరంగూడ మల్లికార్జున నగర్‌లోని ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
సర్వే నంబర్లు 969, 970, 989 నుంచి 1014, 1016, 1018 నుంచి 1020, 1029, 1030, 1033, 1034, 1036 నుంచి 1064, 1110 నుంచి 1118 పరిధిలోని భూముల హద్దులను నిర్ధారించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. ఈ భూములపై పూర్తి విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.
సుమారు 90 నుంచి 92 ఎకరాల పట్టా భూములు ఉన్నాయని, వాటిపై కొందరు ప్రైవేట్ వ్యక్తులు కన్నేసి కబ్జాకు ప్రయ త్నిస్తున్నారని బాధితులు ఆరోపించారు. వారి బారిన పడకుండా సమగ్ర సర్వే నిర్వహించి, సరిహద్దులు నిర్ణయించి తమ భూములకు రక్షణ కల్పించాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. ఏళ్ల తరబడి ఫిర్యాదులు చేస్తున్నా క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నిస్తున్నారు. 2014 హైకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని భూముల వివాదాన్ని పరిష్కరించాలని, కబ్జా ప్రయత్నాలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ పర్యటనతోనైనా తమ భూములకు రక్షణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంక్ సేవలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ ముత్యాల జ్ఞాన సుప్రభాత్

చేర్యాల, అక్టోబర్ 29 (జనంసాక్షి): బ్యాంకు సేవలను ప్రతీఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ ముత్యాల జ్ఞాన సుప్రభాత్ అన్నారు. గురువారం నాగపురి రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఆర్థిక సమ్మిళిత పథకాల సంపూర్ణ అమలు ప్రచారంలో వారు మాట్లాడుతూ బ్యాంక్‌లో ఖాతా ఉన్న ప్రతీ ఒక్కరూ కేవైసీ చేసుకోవాలని అన్నారు. బ్యాంకుల్లో క్రాప్‌లోన్ తీసుకున్న రైతులు ప్రతీ సంవత్సరం విధిగా రెన్యువల్ చేసుకోవాలి అని అన్నారు. సైబర్ నేరాల పట్ల రైతులు, బ్యాంక్ ఖాతా దారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు అధికారులమని చెప్పి ఎవరైనా ఓటీపీ లు చెప్పమంటే ఎవరూ చెప్పవద్దన్నారు.ప్రతీ ఒక్కరూ ప్రమాద బీమా చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు యశ్వంత్ సాయి,కిరణ్ ఎస్ బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజేంద్ర ప్రసాద్ ఎస్ బీఐఆర్‌బీఓలు కే. మారుతి, సాయి లక్ష్మీ చేర్యాల ఎస్ బీ ఐ మేనేజర్ మొహమ్మద్ రఫీ, సర్పంచ్‌లు బండమీది సంతోషి కర్ణాకర్, మెరబోయిన శ్రీశైలం, ఉప సర్పంచ్ ఆవుల సందీప్, రైతులు, మహిళా సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

శివ్వంపేట, అక్టోబర్ 29 (జనంసాక్షి): మెదక్ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మనోహరాబాద్ మండలానికే కరువు హోదా కల్పించడం సరికాదన్నారు. పంటల బీమా అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. నవంబర్ మొదటి వారంలో గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని, ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను 70 శాతం సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. రెండో విడతలో మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి నవంబర్‌లో గ్రామపంచాయతీల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

శివయ్యపల్లిలో భూభారతి రీ సర్వే.. గ్రామసభ

పెద్ద శంకరంపేట, అక్టోబర్ 29 (జనంసాక్షి): మండలంలోని శివయ్యపల్లిలో గురువారం భూభారతి సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమం, గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ ఆర్డీవో రమాదేవి హాజరై క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర భూ సర్వేతో రైతుల భూ సరిహద్దు వివాదాలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతులకు భూముల హద్దులను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దా ర్ నారాయణ, ఆర్ఐ నాగరాజు, సర్వేయర్లు నాగరాణి, గ్రామ సర్పంచ్, ప్రజలు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'కి బయలుదేరిన సదాశివపేట కాంగ్రెస్ నాయకులు

సదాశివపేట, అక్టోబర్ 29 (జనంసాక్షి): ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సదాశివపేట మండల కాంగ్రెస్ నాయకులు బయలుదేరారు. ప్రజాస్వామ్య, ఓటు హక్కుల పరిరక్షణ కోసం కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, మండల అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ పబ్బతి రత్నాకర్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు

ఉమ్మడి కొండపాక మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

కొండపాక, అక్టోబర్ 29 (జనంసాక్షి): ఉమ్మడి కొండపాక మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య డిమాండ్ చేశారు. వెలికట్ట ఎక్స్‌రోడ్డు వద్ద మాట్లాడుతూ కరువు మండలాల జాబితాలో కొండపాక, కుకునూరుపల్లి లేకపోవడం అన్యాయమన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక పంటలు ఎండిపోయాయని, రైతులు అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ నీటిని పంటలకు అందించాలని, రైతు రుణమాఫీతో పాటు నష్టపరిహారం, ప్రభుత్వ సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తటోజు రవీంద్రచారి, మూడోజు కనకచారి పాల్గొన్నారు.

అధికారుల సమన్వయంతోనే మండల ప్రగతి

శ్రీరంగాపూర్, అక్టోబర్ 29 (జనంసాక్షి): మండల అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలుపై మండల ప్రజా పరిషత్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సమర్పించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు వేగంగా, పారదర్శకంగా అందించాలని, శాఖల మధ్య సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలని చర్చించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి సుధారాణి, ఎంపీడీవో చెన్నయ్య, తహసీల్దార్ వరలక్ష్మి, ఎస్సై హిమబిందు, వివిధ శాఖల అధికారులు, గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో జూనియర్ సివిల్ కోర్టు నవంబర్ 7న ప్రారంభం

- మెదక్ జిల్లా జడ్జి నీలిమ

తూప్రాన్, అక్టోబర్ 29 (జనంసాక్షి): తూప్రాన్ పట్టణంలోని పాత ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ సివిల్ జడ్జి-కమ్-జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టు ఏర్పాటుకు హైకోర్టు నుంచి అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా జడ్జి నీలిమ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ ఆదేశాలతో తూప్రాన్‌లోని పాత ఎంపీడీవో భవనంలో రిపేర్లు, మెరుగుదల పనులు పూర్తి చేసి కోర్టును ఏర్పాట్లును పరిశీలించి కోర్టు నవంబర్ 7న ప్రారంభిస్తున్నట్లు జిల్లా జడ్జి నీలిమ తెలిపారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ,మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ ఆర్డీఓ బావయ్య, డిప్యూటీ తాసిల్దారు శ్రీకాంత్, ఎస్ఐ గంగరాజు, రెవెన్యూ సిబ్బంది, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలకు బెంచీల పంపిణీ

సదాశివపేట, అక్టోబర్ 29 (జనంసాక్షి): మండల పరిధిలోని మెలిగిరిపేట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలకు బెంచీలు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ షాబుద్దీన్ స్వయంగా బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు నేలపై కూర్చొని ఇబ్బందులు పడకుండా బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యాభివృద్ధికి, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పి.యాదయ్య, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొని సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హెల్మెట్‌తోనే ప్రాణరక్షణ

గుండుమాల్, అక్టోబర్ 29 (జనంసాక్షి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని కోస్గి ఎస్సై చంద్ర శేఖర్ సూచించారు. ఆయన ఆదేశాల మేరకు గురువారం గుండుమాల్ మండల కేంద్రంలో బ్లూ కోర్ట్ పోలీసు బృందం యువతకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించింది. రోడ్డు ప్రమాదాల్లో తలకు తీవ్ర గాయాలు కాకుండా హెల్మెట్ రక్షణ కల్పిస్తుందని పోలీసులు వివరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ ప్రాణాలతోపాటు ఇతరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది అంబయ్య గౌడ్, సతీష్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

వెల్దండ, అక్టోబర్ 29 (జనంసాక్షి): పోతేపల్లి గ్రామానికి చెందిన భూష రాజ్ శ్రీశైలం మృతి చెందగా, అంజి మాస్టర్ కుటుంబాన్ని పరామర్శించి రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు

- మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆర్థిక సహకారంతో యువతకు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ
- టాస్క్ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు 45 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ
- శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్ అవకాశాలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 29(జనంసాక్షి): నేటి పోటీ ప్రపంచంలో విద్యార్హతలతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం ఎంతో ముఖ్యమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆర్థిక సహకారంతో, నగరంలోని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో 45 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ పొందిన 50 మంది విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. యువతలో నైపుణ్యాలను పెంపొందించి, వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా టాస్క్ సంస్థ అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడటంతో పాటు, వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. మారుతున్న కాలానికి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రస్తుత శిక్షణతోనే ఆగిపోకుండా, మరింత ఉన్నత స్థాయి కోర్సులు అభ్యసిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకున్నప్పుడే ఆశించిన లక్ష్యాలను సాధించగలరని పేర్కొన్నారు.

టాస్క్ సంస్థ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు 45 రోజుల పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాల్లో శిక్షణ అందించినట్లు తెలిపారు. ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించడంతో పాటు, శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పించడం సంతోషకరమన్నారు. యువతలోని ప్రతిభను గుర్తించి, దానికి తగిన శిక్షణ అందించడం ద్వారా వారిని ఉద్యోగాలకు సిద్ధం చేయవచ్చని తెలిపారు. మహబూబ్‌నగర్ యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనలో అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ, తమ ప్రతిభకు తగిన ఉద్యోగాలను సాధించి కుటుంబాలకు, సమాజానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. నైపుణ్యమే విజయానికి పునాది.. శిక్షణే ఉపాధికి మార్గం అనే లక్ష్యంతో యువత భవిష్యత్తుకు బాటలు వేస్తున్న టాస్క్ సంస్థ, మహబూబ్‌నగర్ ఫస్ట్ కార్యక్రమాలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, టాస్క్ సంస్థ ఇన్‌ఛార్జి సిరాజ్, కోఆర్డినేటర్ సతీష్, మాజీ కౌన్సిలర్ శరత్ చంద్ర, మహ్మద్ రియాజుద్దీన్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లను రద్దు చేయాలి

- సీపీఐ డిమాండ్

జడ్చర్ల, అక్టోబర్ 29 (జనంసాక్షి): జడ్చర్ల పట్టణంలో ప్రభుత్వ అనుమతులు, ఫైర్ సేఫ్టీ నిబంధనలు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత లేని సిబ్బందితో వైద్యం చేయిస్తూ, అనవసర పరీక్షల పేరుతో పేద ప్రజలను దోచుకుంటున్నారని మండిపడ్డారు. ల్యాబ్ టెక్నీషియన్లు లేకుండానే రిపోర్టులు ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అక్రమ హాస్పిటళ్ల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని కోరారు. అధికారులు స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాగి కృష్ణయ్య, బి. మహేష్ బాబు పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా జీవించాలి: డీఎస్పీ నరేందర్ గౌడ్

- మత విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు తప్పవు

తూప్రాన్, అక్టోబర్ 29 (జనంసాక్షి): కులమతాలకు అతీతంగా, ఎలాంటి వివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సమాన హక్కులతో జీవించాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సూచించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సివిల్ రైట్స్ డే సందర్భంగా మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో నిర్వహించిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ఇతరుల హక్కులకు భంగం కలిగించరాదని తెలిపారు. గ్రామాల్లో కులవివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అన్ని కులాలు, మతాల వారు పరస్పర గౌరవం, ఐకమత్యం, సోదరభావంతో మెలగాలని సూచించారు. గ్రామాభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, వివక్ష ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కులవివక్షకు తావులేకుండా అందరినీ సమానంగా గౌరవిస్తూ, ఐకమత్యంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో ఎస్ఐలు గంగరాజు, మధుసూదన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, కమ్యూనిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, వివిధ కులాల ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన నవీన్ నాయక్

నారాయణపేట, అక్టోబర్ 29 (జనంసాక్షి): జాతీయస్థాయి జూనియర్ కబడ్డీకి నారాయణపేట జిల్లా విద్యార్థి నవీన్ నాయక్ ఎంపిక అయ్యారు. ఈనెల 2 నుండి 5 వరకు వేములవాడ సిరిసిల్ల జిల్లాలో జరిగిన జూనియర్ బాలుర కబడ్డీ టోర్నమెంటులో నవీన్ నాయక్ నారాయణపేట జిల్లాకు ప్రాతినిధ్యం వహించి 33 జిల్లాల కబడ్డీ టోర్నమెంటులో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెన్నారం వెంకటప్ప తెలిపారు. నవీన్ నాయక్ ఎంపిక పట్ల కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ గవినోళ్ల బాలకృష్ణ రెడ్డి, అధ్యక్షులు గోటూరు నాగేశ్వర్ రెడ్డి నారాయణపేట జిల్లా కబడ్డీ సంఘం పెద్దలు అభినందనలు తెలియజేశారు.

జహీరాబాద్ ఏఎంసీ చైర్మన్ పదవి ముస్లిం అభ్యర్థికి కేటాయించాలి

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డికి కాంగ్రెస్ నాయకుల వినతి

కోహీర్, అక్టోబర్ 29 (జనంసాక్షి): జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవిని ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన అర్హుడైన నాయకుడికి కేటాయించాలని కోరుతూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు బలమైన వినతిని సమర్పించారు. ముస్లిం మైనారిటీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని వారు విజ్ఞప్తి చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి. అర్షద్ అలీ నాయకత్వంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఈ వినతిని సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న నేపథ్యంలో మైనారిటీ వర్గాలకు కూడా రాజకీయ పదవుల్లో తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. జహీరాబాద్ నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన అర్హులైన నాయకులు ఉన్నారని, వారిలో ఒకరికి ఏఎంసీ చైర్మన్ పదవి కల్పిస్తే ఆ వర్గానికి తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

ప్రజా సేవలో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న మైనారిటీ నాయకులకు పదవుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా పార్టీపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఏఎంసీ చైర్మన్ పదవిని ముస్లిం అభ్యర్థికి కేటాయించడం ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాలకు బలం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్ది సర్పంచ్ ఎం.డి. అర్షద్ అలీ, కోహీర్ మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి. షంషీర్ అలీ సాహెబ్, మీర్ జావేద్ అలీ, కోహీర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి. ముజమ్మిల్, ఉబైద్ పటేల్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇంజినీర్ ఎం.డి. మజీద్ అహ్మద్, ఎం.డి. జుబేర్ పటేల్, ఎం.డి. ముబషీర్, ఎం.డి. అయూబ్ తదితరులు పాల్గొన్నారు. జహీరాబాద్ ఏఎంసీ చైర్మన్ పదవిపై తమ విజ్ఞప్తిని పార్టీ రాష్ట్ర నాయకత్వం సానుకూలంగా పరిశీలించి, అర్హుడైన ముస్లిం నాయకుడికి అవకాశం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బాలల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

అడ్డాకుల, అక్టోబర్ 29 (జనంసాక్షి): పీఎం శ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, పోక్సో చట్టంపై సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిరా అవగాహన కల్పించారు. వేధింపులు ఎదురైతే భయపడకుండా అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే

ఆత్మకూర్, అక్టోబర్ 29 (జనంసాక్షి): మూలమల్లలో పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

జనంసాక్షి

అభివృద్ధి కోసం సొంత ప్రభుత్వంతోనూ పోరాడుతున్నా!

- కేటీఆర్, హరీశ్‌రావు నన్ను మెచ్చుకుంటుంటే.. లక్ష్మారెడ్డికి నిద్ర పట్టడం లేదు!
- మాజీ మంత్రిపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు
- మూడేళ్లలో 24 సబ్‌స్టేషన్లు.. పదేళ్లలో ఏం చేశారో చెప్పా
- మిడ్జిల్, నవాబ్‌పేట్‌ను కరువు మండలాలుగా ప్రకటించాలని విజ్ఞప్తి

మిడ్జిల్:అక్టోబర్ 29.(జనంసాక్షి): జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు సాధించడంలో వెనక్కి తగ్గేది లేదని, అవసరమైతే సొంత ప్రభుత్వంతోనూ పోరాడుతానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. మిడ్జిల్ మండలంలోని మున్ననూరు, మిడ్జిల్ బోయిన్‌పల్లి, మల్లాపూర్, కొత్తూరు, వెలుగొమ్ములు, చిల్వేరు తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గానికి ఏం చేశారో లక్ష్మారెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్‌రావు సైతం తన పనితీరును ప్రశంసిస్తుండటాన్ని లక్ష్మారెడ్డి తట్టుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మిడ్జిల్ పర్యటన సందర్భంగా మిడ్జిల్, ఊరుకొండ మండలంలో ప్రతి గ్రామానికి రూ.50 లక్షల ఎస్‌డిఎఫ్ నిధులు, అంబేద్కర్ కళాభవన్‌కు 1.90 కోట్లు, బ్రిడ్జిలు, చెక్‌డ్యామ్‌లు, సంఘాల భవనాల నిర్మాణానికి నిధులు తీసుకొస్తుంటే విమర్శలు చేయడం సరికాదన్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన మూడేళ్లలోనే 24 విద్యుత్ సబ్‌స్టేషన్లు తీసుకొచ్చానని అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. పదేళ్లపాటు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన లక్ష్మారెడ్డి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని సవాల్ విసిరారు. నిధుల విషయంలో సొంత ప్రభుత్వాన్నే ప్రశ్నిస్తున్నానని, ప్రజల అవసరాల కోసం పోరాడటం తన బాధ్యతని స్పష్టం చేశారు. తాను భూదందాలు, కబ్జాల కోసం రాజకీయాల్లోకి రాలేదని, ప్రజాసేవే తన లక్ష్యమని అన్నారు.

మిడ్జిల్, నవాబ్‌పేట్ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. కాలువలకు నీరు రాకపోవడంతో మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి పంపులు ప్రారంభించేలా కృషి చేశామని చెప్పారు. అనంతరం మిడ్జిల్ కేజీబీవీలో ఆర్వో వాటర్ ప్లాంట్, త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్, సోలార్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని పాఠశాల ఎస్‌వో కవిత, సిబ్బంది ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

కార్యక్రమంలో బాదేపల్లి మార్కెట్ కమిటీ.మాజీ చైర్మన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, రాష్ట్ర పిఎస్‌సి ఎస్ సెక్రటరీ రబ్బానీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ గౌస్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు సత్యం గుప్తా, మల్లికార్జున్‌రెడ్డి, వెంకటయ్య, నరేందర్, సంపత్, కృష్ణ, ప్రశాంత్, శంకర్, సాయిలు, జంగయ్య, విజయ్, జహీర్, శంకర్ నాయక్, తహసీల్దార్ రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే

మల్దకల్, అక్టోబర్ 29 (జనంసాక్షి): మండల మండల కేంద్రంతో పాటు నేతువానిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నుఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు.మల్దకల్ గ్రామానికి చెందిన లక్ష్మన్న కు,నేతువానిపల్లి, గ్రామానికిచెందిన రూప నాయక్ కు నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు చేయడం జరిగింది. వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులను తో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినది.ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళు గా మా సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి మాకు చాలా సంతోషంగా ఉన్నది మా ఎమ్మెల్యేకి రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి,రమేష్ నాయుడు,మాజీ ఎంపీపీ విజయ్,మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి,జిల్లా సర్పంచ్ సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సర్పంచులు, తూంకృష్ణ రెడ్డి,మాజీ సర్పంచ్ యకోబు, వీరేష్ నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ ప్రహల్లాదరావు, నాయకులు అజయ్, రమేష్ రెడ్డి, వెంకటన్న, గోపాల్ రెడ్డి, చంద్రశేఖర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సబ్సిడీ

స్ప్రింక్లర్లు కాంగ్రెస్ నాయకుల ఇళ్ల వద్దేనా?

ఊర్కొండ, అక్టోబర్ 29, (జనంసాక్షి); నాగర్‌కర్నూలు జిల్లా ఊరుకొండ మండలంలో ప్రభుత్వ సబ్సిడీపై రైతులకు పంపిణీ చేయాల్సిన స్ప్రింక్లర్ సెట్ల స్టాక్ ను కాంగ్రెస్ నాయకుల ఇళ్ల దగ్గర ఎందుకు దించారని మండల రైతుల పక్షాన ఊర్కొండ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధ్యాప వీరారెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యాలయాలు, రైతు వేదికలు, గోదాంలు అందుబాటులో ఉండగా ప్రైవేటు నివాసాల వద్ద స్టాక్ దించడం వెనుక కారణమేంటో అధికారులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ సంబంధించినవని, నిల్వ, పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని అన్నారు.

స్టాక్ ను నాయకుల ఇళ్లవద్ద దించమని ఎవరు ఆదేశించారు, ప్రభుత్వ కార్యాలయంలో ఎందుకు నిల్వ చేయలేదు, లబ్ధిదారుల ఎంపిక నిబంధనల ప్రకారం జరిగిందా అనే విషయాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. స్టాక్ నిల్వ, పంపిణీ రికార్డులను పరిశీలించి అక్రమాలు, రాజకీయ పక్షపాతం తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సబ్సిడీ రైతుల హక్కు అని, అది ఏ పార్టీకో పరిమితం కాకూడదని ఆయన అన్నారు.

భూ సర్వే ప్రక్రియపై గ్రామస్థులకు అవగాహన కల్పించిన అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ

మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 29 (జనంసాక్షి): మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం యారోనిపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభ/అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ పాల్గొని, గ్రామంలో చేపడుతున్న భూ రీసర్వే ప్రక్రియపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూ రీసర్వే ప్రక్రియను చేపడుతున్నట్లు తెలిపారు. భూముల కొలతలను ఖచ్చితంగా నిర్వహించేందుకు, భూహద్దులను స్పష్టంగా గుర్తించేందుకు ఆధునిక రోవర్ సర్వే సాంకేతికతను వినియోగించనున్నట్లు వివరించారు.

రీసర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్ (ఎల్‌పీఎంలు), భూధార్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా భూ రికార్డులను ఖచ్చితంగా నిర్వహించడంతో పాటు, భూముల హద్దులపై స్పష్టత ఏర్పడి, భవిష్యత్తులో భూ యాజమాన్యం, భూహద్దులకు సంబంధించిన వివాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రీసర్వే ప్రక్రియకు సంబంధించి గ్రామస్థులు అడిగిన ప్రశ్నలకు అదనపు కలెక్టర్ సమాధానాలు ఇచ్చి, వారి సందేహాలను నివృత్తి చేశారు. భూ రీసర్వే ప్రక్రియ సజావుగా, సమర్థవంతంగా పూర్తయ్యేందుకు రెవెన్యూ, సర్వే బృందాలకు గ్రామస్థులు పూర్తి సహకారం అందించాలని అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ కోరారు.

ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ (ఎస్‌డిఎల్ఆర్) ఏడీ, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, డిప్యూటీ ఐఓఎస్, మండల సర్వేయర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.30 వేల పరిహారం అందించాలి

- రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించాలి: బీఆర్ఎస్ కార్యకర్తలు డిమాండ్



కొత్తపల్లి, అక్టోబర్ 29 (జనంసాక్షి): కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించిన బీఆర్ఎస్ కార్యకర్తలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, కందులు, పత్తి, వేరుశనగ తదితర పంటలు ఎండిపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంట ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీఆర్ఎస్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పంట నష్టపరిహారం అందించి ఆర్థికంగా అండగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే గ్రామాల్లో పర్యటించి పంట నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, రైతులతో మాట్లాడి వారికి ధైర్యం, చెప్పడంతో పాటు ప్రభుత్వం నుంచి తగిన భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే రైతులను సమీకరించి ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని బీఆర్ఎస్ కార్యకర్తలు హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, నరసింహ, సుల్తాన్, కిరణ్, మొగిలి రెడ్డి, ఆంజనేయులు, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి

భూమి పూజ చేసిన సర్పంచ్ దొడ్ల కవిత



వీపనగండ్ల, అక్టోబర్ 30 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా వీపనగండ్ల మండల పరిధిలోని గోపాల్దిన్నె గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత బాల్ రెడ్డి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత బాల్ రెడ్డి మాట్లాడుతూ ఇండ్లు నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని, వారి సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో మంజూరు చేయించిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు రాష్ట్ర ప్రభుత్వానికి,ఇందిరమ్మ ఇళ్ల కమిటీకి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు.గ్రామంలో చాలామంది అర్హులు ఉన్నారని వారందరికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత బాల్ రెడ్డి,ఉప సర్పంచ్ వెంకటయ్య, మాజీ సర్పంచ్ కురుమయ్య, గ్రామ కార్యదర్శి కర్ణాకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆశన్న,శేఖర్, స్వాములు,వార్డ్ మెంబర్స్ విజయ్ కుమార్ రెడ్డి, నరేష్,చంద్రయ్య, కుటుంబ సభ్యులు ఎర్రగుళ్ల చెన్నమ్మ కురుమయ్య, గ్రామ నాయకులు దేవన్న పాల్గొన్నారు.

లేబర్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి...

- అర్హులైన ప్రతి ఒక్కరూ పథకంపై అవగాహన పెంచుకోవాలి
- సమాచార హక్కు రక్షణ చట్టం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మొగిలి శేఖర్

ఉప్పునుంతల, (జనంసాక్షి): కార్మిక బీమా పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని, అర్హతను బట్టి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సమాచార హక్కు రక్షణ చట్టం 2005 తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మొగిలి శేఖర్ సూచించారు. కార్మికులకే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులు మినహా ఇతర అర్హులైన వారికి కూడా ఈ పథకంలో చేరే అవకాశం ఉంటుందని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు పథకానికి సంబంధించిన అర్హతలు, నిబంధనలను తెలుసుకొని దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

తక్కువ మొత్తంతో బీమా రక్షణ...

తనకు అందిన సమాచారం ప్రకారం, ఈ బీమా పథకంలో 18 నుంచి 55 సంవత్సరాల వయస్సు గల స్త్రీ, పురుషులు చేరేందుకు అర్హులని మొగిలి శేఖర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు మినహా వివిధ రంగాల్లో పనిచేసే కూలీలు, ఇతర అర్హులైన వ్యక్తులు కూడా పథకాన్ని వినియోగించుకోవచ్చని వివరించారు. ఐదేళ్ల కాలానికి రూ.110 చెల్లించాల్సి ఉంటుందని, అంటే ఏడాదికి రూ.22 మాత్రమే ఖర్చవుతుందని తెలిపారు.

అవసరమైన పత్రాలు...

పథకంలో చేరేందుకు రేషన్ కార్డు, ఆధార్ కార్డు ప్రతులను దరఖాస్తుతో పాటు సమర్పించాలని సూచించారు. నిర్దేశిత రుసుము చెల్లించిన బ్యాంకు చలానాను జతచేసి సంబంధిత కార్మిక శాఖ కార్యాలయంలో దరఖాస్తు అందించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే ముందు పథకానికి సంబంధించిన తాజా మార్గదర్శకాలు, అర్హతలు, చెల్లింపు విధానాన్ని అధికారుల ద్వారా నిర్ధారించుకోవాలని సూచించారు.

బీమా ద్వారా కలిగే ప్రయోజనాలు...

ఈ పథకం కింద పాలసీదారుడు సహజ మరణం పొందితే రూ.1.30 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6 లక్షల బీమా పరిహారం అందే అవకాశం ఉందని మొగిలి శేఖర్ వివరించారు. ఒక కుటుంబంలో ఇద్దరు ఆడపిల్లలకు వివాహ కానుకగా ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున ఆర్థిక సహాయం అందుతుందని పేర్కొన్నారు. అలాగే రెండు ప్రసవాలకు సంబంధించి ప్రసూతి ప్రయోజనంగా ఒక్కో ప్రసవానికి రూ.30 వేల చొప్పున సహాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. బీమా పాలసీ తీసుకున్న ఏడాది తర్వాత ప్రమాదం కారణంగా 50 శాతం వైకల్యం ఏర్పడితే రూ.2.50 లక్షలు, 100 శాతం వైకల్యం ఏర్పడితే

రూ.5 లక్షల వరకు పరిహారం పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

ప్రతి కుటుంబానికి అవగాహన అవసరం...

కార్మిక బీమా పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని మొగిలి శేఖర్ అన్నారు. అర్హులైన వారు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులకు కూడా ఈ పథకాల గురించి తెలియజేయాలని కోరారు. సంబంధిత మండల కార్మిక శాఖ అధికారులతో పాటు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలను సంప్రదించి పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

బాలల రక్షణ సమష్టి బాధ్యత

గద్వాల, అక్టోబర్ 29(జనంసాక్షి): బాలల హక్కుల పరిరక్షణ మరియు వారి భద్రత అనేది సమాజంలోని ప్రతి ఒక్కరి సమష్టి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి.నిష్కా పాత్రుడు స్పష్టం చేశారు. గురువారం గద్వాల పట్టణంలోని అక్షర కాన్సెప్ట్ స్కూల్ మరియు ప్రగతి విద్యానికేతన్ పాఠశాలల్లో "సురక్షిత్ బచ్చన్ అభియాన్" లో భాగంగా ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా న్యాయమూర్తి నిష్కా పాత్రుడు మాట్లాడుతూ బాల్య వివాహాలు, చిన్న పిల్లలపై జరిగే లైంగిక వేధింపులు చట్టప్రకారం అత్యంత తీవ్రమైన నేరాలని నిందితులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థి దశ నుంచే పిల్లలకు తమ హక్కులపై, ముఖ్యంగా పోక్సో చట్టంపై పూర్తి అవగాహన ఉండటం ఎంతో అవసరమన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే భయపడకుండా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు లేదా చట్టపరమైన అధికారులకు నివేదించాలని విద్యార్థులకు ధైర్యం చెప్పారు.సమాజంలో బాలలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆమె పేర్కొన్నారు. విద్యాసంస్థలు కేవలం చదువుకే పరిమితం కాకుండా ఇలాంటి చట్టపరమైన అవగాహన సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, న్యాయవాదులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి గుడి నిర్మాణానికి సర్పంచ్ కేశమల్ల అనూష కృష్ణ భారీ విరాళం

వెల్దండ, అక్టోబర్ 29 (జనంసాక్షి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి యాదవ గుడి స్లాబ్ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ కేశమల్ల అనూష కృష్ణ రూ.1,50,116 ఆర్థికసాయం అందించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు తన వంతు సహాయంగా ఈ మొత్తాన్ని అందజేశారు. గ్రామంలో ఎవరైనా కులదైవాల ఆలయాల నిర్మాణం చేపడితే తన వంతు ఆర్థిక సహాయం అందిస్తానని సర్పంచ్ అనూష కృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో యాదవ కుల పెద్దలు,యాదవ కమిటీ అధ్యక్షుడు కాగుల సాయి,ఉపాధ్యక్షుడు మెండే శివ,వార్డు సభ్యులు తిరుపతి నాయక్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఫ్లాగ్ డే వేడుకలు

- పాల్గొన్న డి.ఎస్.పి సాయిరెడ్డి వెంకటరెడ్డి

ఊర్కొండ, అక్టోబర్ 29 (జనంసాక్షి):నాగర్‌కర్నూల్ జిల్లా: ఊర్కొండ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ ఫ్లాగ్ డే వేడుకలు ఎస్ఐ రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్వకుర్తి డీఎస్పీ సాయి రెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పోలీస్‌శాఖ అందిస్తున్న సేవలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక వెంకట బలరామయ్య పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ఆత్మస్థైర్యాన్ని ఇస్తాయి : ఎస్సై జె.నరేష్ కుమార్

- క్రికెట్ క్రీడలను ప్రారంభించిన బిఆర్ఎస్ నాయకులు ముంత మల్లయ్య యాదవ్

వీపనగండ్ల, అక్టోబర్ 30(జనంసాక్షి):
గ్రామీణ ప్రాంతాల్లో యువకులు క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల స్నేహభావం,ఐక్యత పెంపొందుతాయని స్థానిక ఎస్సై నరేష్ అన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకొని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ మండల నాయకుడు ముంత మల్లయ్య సూచించారు.వీపనగండ్ల మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను గురువారం జె.ఎస్సై నరేష్ కుమార్, బీఆర్ఎస్ మండల నాయకుడు ముంత మల్లయ్య ప్రారంభించారు.ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలోని 32 జట్లు పాల్గొంటున్నట్లు అంబేద్కర్ యూత్ సభ్యులు పాము రాజశేఖర్, నరేందర్, అశోక్ తెలిపారు. యువత క్రీడల్లో రాణించాలి ఈ సందర్భంగా జె.ఎస్సై నరేష్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీల నిర్వహణ యువతలో స్నేహభావాన్ని పెంపొందించడంతోపాటు ఐక్యతకు దోహదపడుతుందని అన్నారు. యువత క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ మండల నాయకుడు ముంత మల్లయ్య మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకొని చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు. దాతకు ఘన సన్మానం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలకు అన్ని విధాలా సహకారం అందించిన దాత ముంత మల్లయ్యను యూత్ సభ్యులు శాలువాతో ఘనంగా

సన్మానించారు. అనంతరం టాస్‌వేసి పోటీలను ప్రారంభించడంతోపాటు ఇరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యులు మీసాల నాగరాజు, పాము నాగులు, రాజశేఖర్, నరేందర్, అశోక్, బాబు, టోర్నమెంట్ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలతో

నష్టపోయిన పత్తి పంటను పరిశీలన

- నష్టపోయిన రైతుకు పరిహారం అందించాలి
- మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీరాజ్

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 29(జనంసాక్షి):
నాసిరకం పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతు పొలాన్ని వ్యవసాయ అధికారులు ఏడి వెంకట లక్ష్మి, ఏవో రమేష్ పరిశీలించారు. పంటను పరిశీలించిన అనంతరం దిగుబడిని చూసి నాసిరకం విత్తనాల కారణంగా పంట నష్టపోయి నట్లు అధి కారులు గుర్తించినట్లు

సమాచారం. ఈ సందర్భంగా మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ మాట్లాడుతూ... సదాశివపేట మండలం మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు జలీల్ ఆద్య పత్తి విత్తనాలు 5 ఎకరాలలో సాగు చేశారన్నారు. ఎకరానికి 15 క్వింటలు దిగుబడి రావాల్సి ఉండగా నకిలీ విత్తనాల కారణంగా ఎకరానికి కేవలం 1క్వింటలు పంట దిగుబడి కావడంతో

రైతు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఎకరానికి ఖర్చు రూ .40వేలు పెట్టుబడి పెట్టి రైతు తీవ్రంగా నష్టపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు.

నష్టపోయిన పంటకు నష్టపరిహారం అందించి రైతును ఆదుకోవాలని కోరారు. నాసిరకం విత్తనాలు అమ్మిన డీలర్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

అనుమతుల్లేకుండా

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కె.టి.దొడ్డి అక్టోబర్ 29(జనంసాక్షి): ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్ మరియు ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు కె.టి. దొడ్డి ఎస్ఐ పాగడాల శ్రీనివాసులు తెలిపారు.

ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రంలోని గాజులపాడు నుండి అల్లాపాడు గ్రామానికి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ విజయ్ తో పాటు, కర్ణాటక రాష్ట్రం గాజులపాడు గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని జంగిలప్ప లపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ... మండల పరిధిలో ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే సహించేది లేదని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లు పట్టివేత

- డ్రైవర్లు, యజమానులపై కేసులు నమోదు చేసిన మక్తల్ పోలీసులు

మక్తల్, అక్టోబర్ 29 (జనంసాక్షి): మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణపేట X రోడ్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నారు. ఈ రెండు వాహనాలకు సంబంధించి డ్రైవర్లు, యజమానులపై పోలీసులు నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా మక్తల్ ఎస్సై పి. రాజు మాట్లాడుతూ ఎవరైనా సరే అక్రమంగా ఇసుక, మొర్రం, ఎర్రమట్టి వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

- సేవా గుణాన్ని చాటిన మాజీ సర్పంచ్ వీరెడ్డి పర్వత రెడ్డి

ఉర్కొండ, అక్టోబర్ 29 (జనంసాక్షి); ఊర్కొండ మండలంలోని ముచ్చర్లపల్లి నుండి రేవల్లి వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని రైతులు మాజీ సర్పంచ్ వీరెడ్డి పర్వత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించారు. డిప్యూటీ సర్పంచ్ మధు సాయి కిరణ్ రెడ్డితో కలిసి సొంత నిధులతో రోడ్డుకు మట్టి కొట్టించి మరమ్మతు పనులు చేపట్టారు. వారి సేవాభావాన్ని రైతులు, గ్రామ పెద్దలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దార జంగయ్య, మారుపాకుల శ్రీనివాస్ గౌడ్, బర్ల పాండు, పల్లె కేశవులు గౌడ్, దారా బంగారయ్య, నీరటి ఆంజనేయులు, కుడుముల బుచ్చిరెడ్డి, వెల్జాల్ జంగయ్య, కొప్పుల శ్రీశైలం, వెల్జాల్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండుమాల్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

గుండుమాల్, అక్టోబర్ 29 (జనంసాక్షి): గుండుమాల్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతుకు మద్దతు ధర అందించడమే లక్ష్యం, రైతులు తమ ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించి లబ్ధి పొందాలని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు భీమ్‌రెడ్డి, సర్పంచ్ శ్రీశైల నర్సింలు, మండల వ్యవసాయ అధికారి రేష్మారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు హర్షవర్ధన్, నరేందర్, సహకార సంఘం సీఈఓ అనంతయ్య, రైతులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో నూతన పోలీస్ స్టేషన్

స్థలం పరిశీలించిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్

- ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యం

కొత్తపల్లి, అక్టోబర్ 29(జనంసాక్షి): నారాయణపేట జిల్లాలోని మద్దూరు పరిధిలో కొత్తపల్లి మండలంలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆ ప్రాంతంలోని స్థలాన్ని పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు అనువైన స్థలాలు, భౌగోళిక పరిస్థితులు, ప్రజలకు అందుబాటులో ఉండే అంశాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడం, శాంతిభద్రతలను పరిరక్షించడం, నేరాలను నియంత్రించడం, ఫిర్యాదులపై వేగంగా స్పందించడం లక్ష్యంగా నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటుతో ఆయా గ్రామాలు, పరిసర ప్రాంతాల ప్రజలకు పోలీస్ సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయని, నేరాల నివారణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ సైదులు, ఎస్సైలు విజయ్ కుమార్, చంద్రశేఖర్‌తో పాటు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

17వ రోజుకు చేరుకున్న ఉద్యోగుల రిలే దీక్షలు

నారాయణపేట, అక్టోబర్ 29 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం టీజీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి నారాయణపేట జిల్లాలో 17వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం గౌరవ అధ్యక్షులు బిక్షపతి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తూ ఆరోగ్య శాఖలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తమకు ఉద్యోగ భద్రత లేకపోవడం ఆవేదన కలిగిస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రజలకు వైద్య సేవలు అందించడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తున్నామని వివరించారు. సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించి, తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వెంకట రమణ, కోశాధికారి రాఘవేందర్, సభ్యులు నరసింహారావు సగరి, మోనేష్ చారి, తిరుపతి, శ్రీలత, అర్చన, ఐశ్వర్య, నవ్య దీప్తి, శ్వేత శ్రీ, రామస్వామి, వినోద్, గాయత్రి, అజారుద్దీన్, ఆశ బి, రామేశ్వరి, అపర్ణ, నాగజ్యోతి, పుష్ప, సుమిత్ర, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం.. 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

అమరచింత, అక్టోబర్ 29 (జనంసాక్షి): గురువారం నాడు ప్రజల విద్యుత్ సమస్యను పరిష్కరించిన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మున్సిపాలిటీ కేంద్రం లోని 6వ వార్డు సమీపంలో ప్రజలు ఎదుర్కొంటున్న లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి మత్స్య, క్రీడలు, యువజన శాఖ, మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారంగా, టీజీ టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనలతో సంబంధిత అధికారులు, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.గత కొంతకాలంగా లో వోల్టేజ్ కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభించడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, వోల్టేజ్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినందుకు ఉపశమనం కలిగింది. ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి అలాగే ఈ సమస్య పరిష్కారానికి సహకరించిన కేశం నాగరాజు గౌడ్ స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యాలు అందించేందుకు కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు

కే. శ్రీలన్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు టి. రవికాంత్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్ కోఆప్షన్ సభ్యుడు తోఫిక్ ఏఈ నిసార్ దామోదర్ ,కాంట్రాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

పెద్ద శంకరంపేట మండలంలో

జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య ఆకస్మిక పర్యటన...

పెద్ద శంకరంపేట, అక్టోబర్ 29 (జనంసాక్షి): పెద్ద శంకరంపేట మండలంలోని కమలాపూర్ ఆరేపల్లి, కోలపల్లి, కే వెంకటాపూర్లో మెదక్ పంచాయతీ అధికారి కమలాపురం గ్రామాలను సందర్శించి, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి సంబంధించిన మార్కింగ్ పనులను తనిఖీ చేసి, పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, కేంద్రం నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, పిల్లలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అలాగే పెన్సిల్ యాప్‌లో వెరిఫికేషన్‌కు సంబంధించిన వివరాలను పరిశీలించి, సంబంధిత సమాచారాన్ని ధృవీకరించారు. సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు అందించి, పనులను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పేట మండల ఎంపీడీవో జాకీర్ హుస్సేన్,

ఆయా గ్రామాల సర్పంచులు సుజాత రాములు, రుమాల సాయిలు, వెంకట్రావు, విట్టల్, తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాల

పరిష్కారానికి భూముల రి సర్వే...

- మెదక్ ఆర్ డి ఓ రమాదేవి

పెద్ద శంకరంపేట్, అక్టోబర్ 29 (జనంసాక్షి): గ్రామాలలో భూముల వివాదాలు పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి భూముల రి సర్వే చేపట్టిందని మెదక్ డివిజన్ ఆర్ డిఓ రమాదేవి పేర్కొన్నారు. గురువారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని శివయ్య పల్లి లో భూ సర్వే పై రైతులకు గ్రామస్తులకు గ్రామ సభ నిర్వహించి అవగాహన కల్పించారు. రైతులు భూముల రి సర్వే ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.. భూముల రీ సర్వే వల్ల గ్రామంలోని భూములకు పటిష్టంగా హద్దులు నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సర్వేయర్ కిషన్.. తాసిల్దార్ నారాయణ..ఆర్ ఐ నాగరాజు.. డివిజనల్ సర్వేయర్ అజీమ్.. మండల సర్వేయార్ నాగరాణి . సర్పంచ్ నరేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..